క్లుప్తంగా

కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం భవన నిర్మాణ సంఘం బోర్డు ద్వారా అమలు చేస్తున్న పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్మిక సంక్షేమబోర్డు అమలు చేస్తున్న సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు తిప్పయ్య, బాబు, కతలప్ప, కోళ్ల నాగేష్, కురుమయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామ మాజీ సర్పంచ్ యశోదమ్మ (73) శనివారం రాత్రి మృతిచెందారు. ఈం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, రాజుల ఆశిరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కటుంబసభ్యులను పరామర్శించారు. సూర్యప్రకాష్‌రెడ్డి, మణెమ్మ, సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

మందిపల్లిలో లోపించిన పారిశుద్ధ్యం



మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలో పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామంలోని ప్రధాన వీధులు బురదమయంగా మారిందన్నారు. దీంతో కనీసం నడవడానికి కూడా రాని పరిస్థితి నెలకొందని, ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీటితో పాటు, మురుగునీటితో దోమలు వృద్ధి చెంది ఇప్పటికే గ్రామంలో చాలామంది ప్రజలు అనారోగ్యం బారినపడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టి మురుగును తొలగించాలని కోరుతున్నారు.

ఘనంగా మిలాదున్నబీ ఉత్సవాలు



అమరచింత: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్- ఉన్- నబీ ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గంధోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని మసీద్ కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం నబీసాబ్ మసీదులో పిండివంటలతో పాటు పాయసాన్ని నైవేద్యంగా భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. సోమవారం ఆసర్ ముబారక్ ద్వారా మహ్మద్ ప్రవక్తకు సంబంధించిన కేశాలను ప్రదర్శనగా ఉంచుతున్నట్లు వెల్లడించారు.

అధ్యయన తరగతులకు బయలుదేరిన నాయకులు

అమరచింత: శాస్త్రీయ అధ్యయనం భావవాదం భావాజాలంపై ఆదివారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో నిర్వహించే నాస్తిక అధ్యయన తరగతులకు పట్టణం నుంచి నాస్తిక సమాజం నాయకులు ఆదివారం బయలుదేరారు. హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఒకరోజు నాస్తిక అధ్యయన సమావేశం నిర్వహిస్తున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. అధ్యయన తరగతుల్లో నాస్తిక వాదం, మూఢనమ్మకాలు, భౌతిక భావవాదాలపై ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. హైదరాబాద్‌కు తరలినవారిలో విజయరాములు, భక్తరాజు, లక్ష్మీనారాయణ, రవీందర్, కుతుబ్, రఘు ఉన్నారు.





దామరగిద్దలో నృత్యాలు చేస్తున్న యువకులు



మరికల్‌లో నృత్యాలు చేస్తున్న కళాకారులు



ఊట్కూరులో పూజలో పాల్గొన్న భక్తులు

వినాయకా.. సెలవిక

మక్తల్: పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం గణనాథుల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని మాద్వార్‌లో బ్రమ్మంగారి ఆలయం వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లడ్డూవేలం పాట నిర్వహించి గణనాథుడి ఎదుట యువకులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా నిమజ్జనం నిర్వహించారు. అంతకుముందుకు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్, కందెన్‌పల్లి, ఉడ్మల్‌గిద్ద తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆటపాటలతో శోభయాత్రతో నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు లడ్డూ వేలం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధన్వాడ: గత తొమ్మిది రోజులుగా ఎంతో ప్రతిష్ఠంగా కొలువుదీరి ప్రతిష్ఠించిన వినాయకుడిని నేడు తొమ్మిదోరోజు చివరి రోజు కనుక మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం లడ్డూవేలం పాట నిర్వహించి గణనాథుడి ఎదుట ఆటపాటలతో డ్యాన్స్‌లు చేస్తూ యువకులు ఎంతో ఉత్సాహంగా నిమజ్జనం నిర్వహించారు.

నారాయణపేట రూరల్: పట్టణంలో వివిధ ఆలయాలు, మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడికి తొమ్మిదోరోజు పూజలు ఘనంగా నిర్వహించారు. సాయివిజయకాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రముఖ వైద్యులు గీత, విశ్వనాథ్, కాన్‌కుర్తి జెడ్పీస్కూల్ జీహెచ్‌ఎం అన్నపూర్ణ, శివరాజ్ దంపతులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. అదేవిధంగా తిరుమలదేవుడి గుట్ట, దోబివాడలో అన్నదానం చేశారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి గొడుగుగేరి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఎంపీ డీకే అరుణ సైతం పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఊట్కూరు: మండలంలోని వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి పలు వినాయకుల వద్ద భక్తులు పూజలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజుల ఆశిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం మేన్‌బజార్ హనుమాన్ మందిర్ వినాయక మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. సూర్యప్రకాష్ రెడ్డి, నరేష్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పాపిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ విగ్రహాలను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. మండపాల వద్ద యువకులు ఆటపాటలతో నృత్యాలు చేశారు. అనంతరం మరికల్ పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.



మక్తల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



మాగనూర్‌లో వేలం పాటలో లడ్డు పొందిన వ్యక్తికి సన్మానిస్తున్న సభ్యులు

రూ.60,100 పలికిన లడ్డూ వేలం

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో శ్రీ మల్లికార్జున యువక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద ఆదివారం లడ్డూ వేలం రూ.60,100 ధర పలికిందని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వినాకుడుని ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించారు.

వాడవాడల అన్న ప్రసాద వితరణ

నర్వ: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండంలోని ఆయా గ్రామాల్లో నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ ఆదివారం చేపట్టారు. ఈమేరకు.. నర్వ, పాథర్చేడ్, రాయికోడ్, పెద్దకడ్మూర్, బెక్కర్‌పల్లి, ఎల్లంపల్లి, లంకాల్, కుమార్‌లింగంపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం మండపాల వద్ద మహిళలు, యువకులు, ప్రత్యేక నృత్యాలతో అలరించారు. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు ఆదివారం రాత్రి నిమజ్జనోత్సవ పూజలు అందుకున్నాడు. ఈ మేరకు.. యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో అన్నదాన నిర్వహించారు. పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు భజనలు చేశారు. అంతనం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మరికల్ బోనాలతో నృత్యాలు చేస్తున్న మహిళలు



నారాయణపేటలో మండపం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ధన్వాడలో డ్యాన్స్‌లు చేస్తున్న యువకులు

సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



పేటలో కరపత్రాన్ని విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి బి. రాము తదితరులు

నారాయణపేట: తెలంగాణలో ప్రజా పోరాటాలకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోనీ పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 17కు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి నుంచి తెలంగాణ ప్రజల విముక్తికోసం సీపీఐ జరిపిన పోరాటం ద్వారానే తెలంగాణ భారతదేశంలో విలీనమైందని సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లనే తెలంగాణ భారతదేశంలో కలిసిందని చెప్పారు. కమ్యూనిస్టులు నిజాం మద్దతుదారులైన దొరలు భూస్వాములు, జమీందారులు, జాగీర్‌దారులను తరిమికొట్టి మూడు వేల గ్రామాలకు విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. అదే పోరాట స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం, అభివృద్ధి, సంక్షేమం కోసం పాలక ప్రభుత్వాలపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్, డివిజన్ నాయకులు బి.యాదగిరి, విజయలక్ష్మి, బి. రాము, నరసింహ, చెన్నారెడ్డి, ప్రతాప్ ,ఎస్.సాయికుమార్, నర్సింహ, జి.వెంకటరాములు, సౌజన్య పాల్గొన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న ఎండీ సలీం

మక్తల్: తెలంగాణ ప్రజల విముక్తికోసం సీపీఐ జరిపిన పోరాటం ద్వారానే తెలంగాణ భారతదేశంలో విలీనమైందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం అన్నారు. పట్టణంలోని ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. తెలంగాణలో ప్రజా పోరాటాలకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకుడు కిరణ్, మహమూద్, ఆంజనేయులు, మారెప్ప, వెంకటేష్, మల్లేష్, లోకేష్, అజయ్, ఇప్టూ జిల్లా ఉపాధ్యక్షుడు భుటో, పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు మల్లేష్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



నారాయణపేట రూరల్: జాతీయస్థాయి కరాటే పోటీల్లో నారాయణపేట విద్యార్థులు సత్తా చాటినట్టు మాస్టర్ అశోక్ తెలిపారు. ఆదివారం జడ్చర్లలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు పాల్గొన్నారు. దీనిలో ఎం అమూల్య, మహేశ్వరి, రాజేశ్వరి బంగారు పతకాలు సాధించగా ప్రశస్త, వెండి పతకం పొందింది. విజేతలకు అకాడమీ ఫౌండర్ కేశవ్ గౌడ్, ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ అశోక్, మాస్టర్ అల్తాఫ్, ఎస్ కే హాజీ, మాస్టర్ శివ కుమార్ యాదవ్, మాస్టర్ రసూల్ పతకాలు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించినట్లు తెలిపారు.

18న ఉచిత వైద్యశిబిరం

నారాయణపేట రూరల్: పట్టణంలోని పాతగంజ్ యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు ప్రీతి రెడ్డి పర్యవేక్షణలో అన్నిరకాల గర్భాశయ వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



మక్తల్: బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు మండంలోని భూత్పూర్‌లో ఆదివారం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య ఆదివారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఇంటింటికీ చేరేవిధంగా ప్రతి కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. కన్వీనర్ కర్నిస్వామి, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ కుర్వ హన్మంతు, కతల్ హుస్సెన్, అనంద్, శేఖర్, లక్ష్మారెడ్డి, మోహన్‌గౌడ్, నాగప్ప, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన విజ్ఞాన మేళా

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన విజ్ఞానమేళా ఆదివారం ముగిసింది. వివిధ అంశాలలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను న్యాయనిర్ణేతలు పరిశీలించి విజేతలను ఎంపికచేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి విభాగ్ ఉపాధ్యక్షుడు మద్ది అనంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ మేళాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. గెలుపొందిన వారు ఈ నెల 25నుంచి మూడురోజులపాటు హైదరాబాద్‌లో జరిగే ప్రాంత స్థాయి (రాష్ట్ర) పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు. రతంగపాండురెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లప్ప, బాలరాజు, సీతారాములు, శేర్‌కృష్ణారెడ్డి, లక్ష్మయ్యగౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రయోగాలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నారాయణపేట: మండల పరిధిలోని కొల్లంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన 2006–07 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు ఆదివారం సమావేశమై ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పూర్వ విద్యార్థి పేట కలెక్టర్ సీసీగా పనిచేస్తున్న వెంకట్‌తోటి విద్యార్థులతో మమేకయ్యారు.

నారాయణపేట రూరల్: పట్టణంలోని ఏయిడెడ్ వైదిక ఉన్నత పాఠశాలలో 2005– 06 బ్యాచ్‌లో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రాములు, బాల్‌రెడ్డి, పండారి, భారతమ్మ, పార్వతమ్మ, సుజాత పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం 1994–95 సంవత్సరం పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మొగులప్ప, జనార్ధన్‌రెడ్డి, నారాయణరావు, వెంకట్‌రెడ్డి, మాట్లాడారు. గత 16ఏళ్ల క్రితం తాము చదువు చెప్పిన విద్యార్థులు గొప్పవారై వివిధ రంగాల్లో స్థిరపడటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయలకు శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పేటలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



దామరగిద్దలో..

వైభవంగా బసవేశ్వరస్వామి పల్లకీసేవ



నందికోళ్లు ఆడుతున్న వీరశైవుడు



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సరాప్‌బజార్‌లో బసవేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణమాస ముగింపు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుస్సయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చకులు మంజునాథస్వామి, విశ్వనాథ్‌స్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా సుప్రభాతసేవా, రుద్రాభిషేకం, అలంకారసేవా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పట్టణ పురవీధులగుండా లింగయ్యగుడి వరకు పల్లకిసేవా కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలింగం, పి. శివకుమార్, ఆనంద్, ఆకుల రాజేష్, జే.రవి, శంకర్, వినోద్, కన్నశివు, గుండప్ప, సగర్ విశ్వనాథ్, మహేష్, విజయ్, నిఖిల్, సందీప్, సంతోష్, మల్లు, అప్పి, రాకేష్, సుజాత, నాగమణి, శైలజ, పవిత్ర పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మాగనూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రహదారి సమీపంలో చేతికందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో చూట్టు పక్కల కాలనీవాసులకు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వీటితో పాటు ఉజ్జెల్లిలో పాఠశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో నిత్యం విద్యార్థులు అటుగా వస్తుంటారు. దీంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వర్కూర్ నుంచి నేరడగం గ్రామానికి వెళ్లు దారిలో ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలతో విద్యుత్ బుడ్డీలు కనిపించకుండా ఉన్నాయి. మూగజీవాలు గడ్డికోసం వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాగనూర్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఇలా..



ఉజ్జెల్లి పాఠశాలవద్ద ఇలా..



నేరడగం వద్ద ఇలా..



గురువలింగంపల్లిలో

నేడు మద్యం దుకాణాలు బంద్

ధన్వాడ: మండలంలోని సోమవారం గణనాథుడి శోభయాత్ర సందర్భంగా మండలంలోని మద్యం దుకాణాలతో పాటు బార్లు బంద్‌కు కలెక్టర్ ఆదేశాలు జారి చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు మూతపడి ఉంటాయని, మళ్లీ తిరిగి మద్యం దుకాణాలు 17న ఉదయం ఓపెన్ చేయడం జరుగుతుందని సూచించారు.